క్లుప్తంగా

ఆకట్టుకున్న కంప్యూటర్ ఎక్స్‌పో



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎక్స్‌పో ఆకట్టుకుంది. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను పరిశీలించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నిజ జీవితంలో కంప్యూటర్ ఉపయోగం, ఉద్యోగ, ఉపాధి కార్యక్రమాల్లో దాని పాత్రపై వివరించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్, అప్లికేషన్స్ ఉపయోగపడే విధానాన్ని కంప్యూటర్ పరికరాలతో విద్యార్థులు ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీజీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, ఏబీపీ మనోహర్, అధ్యాపకులు బి. శివకొండయ్య, సీహెచ్. చంద్రశేఖర్, సీహెచ్. శ్రావణ్, కె. సునీత, ఎం. సుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఇంటర్వ్యూలకు 116 మంది హాజరు



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డు వలంటీర్ల నియామకానికి గానూ మంగళ, బుధవారం డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా 301 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేనందున 88 దరఖాస్తులు తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన అనంతరం 212 మందిని అర్హులుగా ప్రకటించగా, వారిలో 116 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. ఎంపికైన వారి ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, ఈ నెల 15 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందని ఆయన సూచించారు.

లోక కల్యాణార్థం విశేష హోమాలు



పాత గుంటూరు: మాస శివరాత్రి పురస్కరించుకొని బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాల్ని రుత్వికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూర్ణాహుతిలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాల్ని స్వీకరించారు. తొలుత ప్రాంగణంలోని గణపతి ఆలయంలో అభిషేకార్చన, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. కార్యక్రమాన్ని బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు నిర్వహించారు.

స్వర్ణలతకు డాక్టరేట్



ఏఎన్‌యూ: సోషియాలజీ పరిశోధకురాలు ఎం. స్వర్ణలతకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి తెలిపారు. ఆమె ఆచార్య వి. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ' ఇంపాక్ట్ ఆఫ్ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆన్ సోషియో– ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ షెడ్యూల్డ్ కాస్ట్ ఉమెన్ ఇన్ రూరల్ ఆంధ్రప్రదేశ్ (ఏ కేస్ స్టడీ ఆఫ్ గుంటూర్ డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్)' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థిని సుశీలకు పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థిని ఆళ్ల సుశీలకు తమ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ''పెర్ఫార్మెన్స్ అవాల్యూషన్ ఆన్ యుటిలైజేషన్ ఆఫ్ స్నెయిల్ షెల్ పౌడర్ సిమెంట్ కాంపోజిట్ ఇన్ డిటీరియోరేటెడ్ స్ట్రక్చర్స్'' అనే అంశంపై ఆమె పరిశోధన చేసిందని తెలిపారు.

పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి



నెహ్రూనగర్: పారిశుద్ధ్య పనుల్లో పర్యవేక్షణ లోపం, విధుల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన నగరంలోని 22, 11, 10 (ఇన్‌చార్జి) వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శుల్ని సస్పెండ్ చేశామని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రికి చార్జి మెమో, శానిటరీ సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రజారోగ్యానికి కీలకమైన పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. కొందరు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటూ, ఉదయం మస్టర్‌కి కూడా హాజరు కావడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఇక నుంచి పారిశుద్ధ్య పనులు, హాజరును ఆకస్మిక తనిఖీలు చేస్తామని చెప్పారు. ఇటీవల తమ క్షేత్రస్థాయి ఆకస్మిక పర్యటనలో తూర్పు నియోజకవర్గం పాత గుంటూరు 22వ వార్డ్ సచివాలయం (బూర్లేవారి వీధి), 10, 11 వ సచివాలయం (వినోభా నగర్) ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగకపోవడం, ఇంటింటి చెత్త సేకరణ ఈ–ఆటోల పర్యవేక్షణ లేకుండా ఉండడంపై 22 వ వార్డ్ సచివాలయం శానిటేషన్ కార్యదర్శి డి.కృష్ణను, 11,10 (ఇన్‌చార్జి) సచివాలయ శానిటేషన్ కార్యదర్శి షేక్ షాహిదా సుల్తానాను విధుల నుంచి సస్పెండ్ చేశామని వెల్లడించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జె.నాగేశ్వరరావు, ఎం.ఐజాక్, శానిటరీ మేస్త్రి బి.వెంకటేశ్వర్లుకు చార్జి మెమోలు, శానిటరీ సూపర్‌వైజర్లు ఆయుబ్ ఖాన్, రాంబాబుకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. 22 సచివాలయానికి 197 సచివాలయం శానిటేషన్ కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వర్లును, 207 సచివాలయ శానిటేషన్ కార్యదర్శి జి.దాసును 11 (ఇన్‌చార్జి),10 సచివాలయాలకు బదిలీ చేసినట్లు చెప్పారు. నగరంలోని సచివాలయ కార్యదర్శుల పనితీరుని పర్యవేక్షణ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు.

యూసీసీకి వ్యతిరేకంగా 15న 'చలో కలెక్టరేట్'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు

నెహ్రూనగర్: యూసీసీ(యూనిఫైడ్ సివిల్ కోడ్)కు వ్యతిరేకంగా మత సామరస్యాన్ని కోరుతూ ఈ నెల 15న కలెక్టరేట్ ఎదుట సామూహిక ప్రార్థన కూటమి నిర్వహించనున్నట్లు ఐక్య(ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలియజేశారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం సామూహిక ప్రార్థన కూటమి కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం యూసీసీకి చట్టబద్ధత కల్పించేందుకు ఐదు రోజులపాటు ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేసి, మైనార్టీ మతాలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో ఒకే మతం ఉండాలి అనే కోణంలో చర్యలకు దిగుతోందని తెలిపారు. అన్ని మతాలు కలసి ఐక్యంగా ఈ దేశంలో జీవించాలని, మత సామరస్యాన్ని కోరుతూ ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలతో కలసి కలెక్టరేట్ వద్ద సామూహిక ప్రార్థన కూటమి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐదు రోజుల పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాట చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రార్థన అనంతరం గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి క్రైస్తవులకు సంబంధించిన ఏడు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు కె. నెహెమ్యా, సహదేవ్, మద్దు జాన్సన్, మల్లెల రాజు, పేరుపోగు సురేష్ జేమ్స్, ఎఫ్రాయుం, కొండేపాటి మోషే, ఎం. బర్నబాస్, ఐజాక్, వందనం, జె. కృపారావు, పాకనాటి ఆంథోని, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమజ్యోతి బాబు, కందుల దీనమణిరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా



పనులను పర్యవేక్షిస్తున్న షేక్ నూరి ఫాతిమా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని తొమ్మిదో డివిజన్ దుర్గానగర్‌లో బుధవారం ఆమె పర్యటించారు. పారిశుద్ధ్య సమస్యలపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సైడు కాల్వలు, డ్రెయిన్లు, పారిశుద్ధ్య సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో 9వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి భాస్కర్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

తూర్పు నియోజకవర్గంలోని రెండో డివిజన్‌లో నూతనంగా మంజూరైన పింఛన్లను నూరి ఫాతిమా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెండో డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నేతలు సత్యం, అవినాష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకురాలు పద్మావతికి సన్మానం



అధ్యాపకురాలు చల్లా పద్మావతిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారాన్ని అందుకున్న చల్లా పద్మావతి కళాశాల కీర్తి, ప్రతిష్ఠలను ఇనుమడింపచేశారని సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్న గణితశాస్త్ర అధ్యాపకురాలు చల్లా పద్మావతిని బుధవారం కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ వృత్తిపట్ల నిబద్ధతతో పని చేస్తున్న పద్మావతి ప్రభుత్వం నుంచి పురస్కారాన్ని అందుకోవడం తోటి అధ్యాపకులకు స్ఫూర్తిదాయకమన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

15,16వ తేదీల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ మహాసభలు



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న నాసర్ జీ, విద్యార్థి నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: నెల్లూరు నగరంలో ఈనెల 15,16వ తేదీల్లో జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర నిర్మాణ మహాసభల్ని జయప్రదం చేయాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జాతీయ నూతన విద్యా విధానంతో విద్యార్థులు మతతత్వంలోకి నెట్టి వేయబడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు మౌలిక వసతుల్ని కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి, భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చుడతామని నాసర్‌జీ వెల్లడించారు. జిల్లా నుంచి విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశిసాయి, అమరనాథ్, గణేష్, అజయ్, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే సహించం

మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న రాజనారాయణ

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి మార్కెట్ యార్డులో ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించాలని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ఆదేశించారు. గుంటూరు మార్కెట్ యార్డులో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. సిబ్బంది కొంతమంది మాత్రమే హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేయింబవళ్లు కష్టపడి పండించిన మిర్చిని తీసుకుని యార్డుకు వచ్చే రైతులకు మేలు చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని అధికారులకు సూచించారు. మిర్చి యార్డు ప్రాంగణం అంతా కలియతిరిగారు. సిబ్బందికి అవసరమైన వనరులు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. యార్డులో నిరంతరం శుద్ధి చేసిన తాగునీటిని అందుబాటులో ఉంచాలని సిబ్బందికి చెప్పారు. వాటర్ ప్లాంట్ వద్ద పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని సూచించారు. మార్కెట్ ఫీజు వసూళ్లను ఎప్పటికప్పుడు వసూలు చేసి మార్కెట్ కమిటీకి అందజేయాలని చెప్పారు.

దూరవిద్య ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల దరఖాస్తులకు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో దూరవిద్య ద్వారా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కోర్సుల ద్వారా రైతులు, యువతకు నైపుణ్యతను కల్పించి వారికి స్వయం ఉపాధి లక్ష్యంగా కోర్సులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇప్పటికే నాలుగేళ్ళలో 4 వేల మంది విద్యార్థులు రైతులు, మహిళలు ఈ కోర్సులలో శిక్షణ పొందటం జరిగిందన్నారు. ఆన్‌లైన్ కోర్సులతోపాటు ప్రతి కోర్సులో ఒక ప్రయోగ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాక్టికల్ క్లాసులను ఒకరోజు స్టడీ సెంటర్‌లలో మాత్రమే నిర్వహిస్తారన్నారు. నవంబర్ నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం కానున్న కోర్సులు చిరుధాన్యాలు, పట్టుపురుగుల పెంపకం, వర్మికంపోస్ట్, బయోఫెర్టిలైజర్స్ తదితర కోర్సులు 8 వారాలు (రెండునెలలు) వ్యవధిలో నిర్వహిస్తారన్నారు. ఒక్కొక్క కోర్సుకు రూ.1500 ఫీజు చెల్లించి కోర్సుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ సదుపాయం కోసం నెట్ సౌకర్యం కలిగిన సెల్‌ఫోన్, కంప్యూటర్, ట్యాబ్, ఐపాడ్ వంటివి కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అక్టోబర్ 20వ తేదీలోగా తమ పేర్లను నమదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను గానీ 8008788776, 8309626619, 9110562727 సెల్ నంబర్లను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ మాత్రమే సంప్రదించాలన్నారు.

పెదకాకాని ఎంపీడీవోగా రామకృష్ణ

ఏఎన్‌యూ: పెదకాకాని మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా ఎ.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ ఉన్నతి పొంది ఎంపీడీవోగా రామకృష్ణ పెదకాకాని వచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీడీవో గా పనిచేస్తున్న బి. వి. మల్లేశ్వరరావు నూతన ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన రామకృష్ణకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను ఎంపీపీ తుళ్ళిమిల్లి శ్రీనివాసరావు కలిసి అభినందనలు తెలియజేశారు. పెదకాకాని మండలంలో అన్ని శాఖల అధికారులను సమన్వయపరిచి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

వివాహిత అదృశ్యం

గుంటూరు ఈస్ట్:వివాహిత అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన వివాహిత భర్తతో విభేదించి మంగళవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకాశం జిల్లాకు చెందిన యువతి...

యువతి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ యువత సాయిపేటలోని బంధువుల ఇంటికి మూడు రోజుల కిందట వచ్చింది. మంగళవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రామిరెడ్డినగర్‌కు చెందిన వ్యక్తి...

వ్యక్తి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్‌కు చెందిన షేక్ సుభాని ఈనెల 12న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష సమావేశం

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించి ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలని ఎంపీడీవో ఎస్.ఆదినారాయణరావు తెలిపారు. బుధవారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న ప్రజల ఆరోగ్య పరిస్థితులపై క్షేత్రస్థాయి కార్యకర్తలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు కె.ఎస్.చారి, డాక్టర్ రూన్సీబాయి, బి.అశ్విన్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

పెదనందిపాడు: పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ సిబ్బందితో దాడి చేసి నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని వరగాని గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1,730 రూపాయల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నట్లయితే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

భూముల రీసర్వే సమస్యలకు చెక్

పొన్నూరు: గ్రామాలలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా చేయాలని జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో భూముల రీసర్వేపై అధికారులు సర్వేయర్లు, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ రీసర్వే వల్ల ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అనేకమంది రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. హద్దులు, కొలతలలో ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా రీ సర్వే చేయాలని సూచించారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ నిధి మీనా, తహసీల్దార్ శ్రీకాంత్, డీటీలు, సర్వేయర్లు, పాల్గొన్నారు.

సుప్రభాత అధ్యయనంతో పరమాత్మ దర్శనం



ప్రవచనం చేస్తున్న కోటేశ్వరరావు

పాత గుంటూరు: బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆధ్యాత్మిక ఉపన్యాసకులు కె.వి.కోటేశ్వరరావు బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి సుప్రభాతం 29 శ్లోకాలలో ప్రథమ అధ్యాయంతో ప్రవచాన్ని ప్రారంభించారు. మన మహర్షులు మనకందించిన గొప్ప వాఙ్మయం వేద విజ్ఞానమని తెలిపారు. వేదాలు, పురాణాలు, శాస్త్రాల్ని అర్థం చేసుకొని పారాయణం చేస్తే భగవంతుని దర్శనంతో మోక్షం కలుగుతుందని చెప్పారు. శ్రీ వేంకటేశ్వరస్వామి సుప్రభాతం 29 శ్లోకాలు, శ్రీ వెంకటేశ్వర స్తోత్రం 11 శ్లోకాలు, వెంకటేశ్వర ప్రపత్తి 16 శ్లోకాలు , మంగళాశాసనాలు 14 శ్లోకాలు కలిగి ఉన్నాయని తెలిపారు. కౌసల్య సుప్రజా రామ అంటూ రామాయణంలోని శ్లోకంతో సుప్రభాతం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సుప్రభాత అధ్యయనంతో పరమాత్మ దర్శనం కలుగుతుందని తెలిపారు. జీవితానికి దైవ ప్రార్థనతో పాటు మానవ ప్రయత్నం ఉంటేనే జీవన ప్రయాణం సాఫీగా సాగుతుందని చెప్పారు. జీవితం సంస్కరింపబడాలంటే శాస్త్రాల్ని అధ్యయనం చేయాలని సూచించారు. ఏ కర్మయినా యజ్ఞ భావంతో చేసినప్పుడు కార్యఫలం కలుగుతుందని వివరించారు.

పెన్షన్ల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం



నూతనంగా పెన్షన్లు పంపిణీ చేసిన లబ్ధిదారులతో సర్పంచ్ మొవ్వా శ్రీదేవి

పెదనందిపాడు: ప్రభుత్వం విడుదల చేసిన రెండవ విడత పెన్షన్ల పంపిణీలో నగదు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని రావిపాడు గ్రామంలో కొత్తగా ఎంపికయిన లబ్ధిదారులకు పెన్షన్లను సర్పంచ్ మొవ్వా శ్రీదేవి అందజేశారు. ఈ సందర్భంగా పెన్షన్లు అందుకున్న లబ్ధిదారులు థాంక్యూ సీఎం జగనన్న అంటూ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కులం,మతం, పార్టీ చూడకుండా పెన్షన్లు ఇస్తున్నారని, తమ గ్రామంలో ఉన్న టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు విక్రయాల సుబ్బారావుకు కూడా నూతనంగా పెన్షన్ మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. కొప్పర్రు గ్రామంలో కొత్తగా పలువురు లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాతులూరి సురేష్, ఉపసర్పంచ్ యేలూరి శ్రీకాంత్, ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మామిళ్ళపల్లిలో నూతన పింఛన్లు

పొన్నూరు: మండలంలోని మామిళ్ళపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు పాల్గొని 19 మంది లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో గ్రామానికి 33 పింఛన్లు మంజూరు కాగా రెండో విడతలో 19 మందికి మంజూరయ్యాయని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి

పెదకాకాని: సమాజ శ్రేయస్సుకు విద్యార్థులు కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. మండల పరిధిలోని వీవీఐటీ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన ఇండక్షన్ ప్రోగ్రాం (ప్రేరణ కార్యక్రమం)లో లక్ష్మణరావు ప్రసంగిస్తూ మన చదువు దేశానికి, సమాజానికి, ఇతరులకు సేవ చేసేందుకు ఉపయోగపడాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. విద్యార్థుల లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దాని సాధనకు ప్రణాళిక రూపొందించుకోవడానికి మొదటి సంవత్సరం ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడంతోపాటు తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేసి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. దేశం కోసం ఏం చేయాలనే భావనతో యువత ముందుకుసాగాలన్నారు. దేశాభివృద్ధిలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లిఖార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎస్. కుమార స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

పెదకాకాని: వినాయక చవితి పండుగ సందర్భంగా మండల పరిధిలో మండపాలు ఏర్పాటు చేయడానికి పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక నిమజ్జనం రోజు, వినాయకుని తీసుకువెళ్లే మార్గము, నిమజ్జన ప్రదేశము ముందుగా పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. అనుమతి కొరకు దరఖాస్తు చేసుకునేటప్పుడు కమిటీ సభ్యుల యొక్క గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌నందు సబ్మిట్ చేయాలని, విగ్రహం పెట్టే సమయంలో ఆ స్థలం ప్రైవేటు వ్యక్తులది అయితే వారి పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. పెదకాకాని మండలంలో ఎక్కడైనా వినాయక విగ్రహం పెట్టాలనుకునే వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి మైక్ పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. విగ్రహం ఏర్పాటు చేసిన తరువాత ఆ విగ్రహ నిర్వహణలో విగ్రహ కమిటీ మెంబర్ల వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. విగ్రహాలకు విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఫైర్, విద్యుత్తు శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మండపాల వద్ద నీళ్ళను ఇసుకను ఏర్పాటు చేయాలి.పండుగ రోజు నుంచి నిమజ్జనం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుత వాతావరణంలో ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలని సూచించారు.

విజ్ఞాన్ వ్యాయామ అధ్యాపకునికి లెఫ్టినెంట్ హోదా

గుంటూరు రూరల్: వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తమ కళాశాల అధ్యాపకునికి లెఫ్టినెంట్ హోదా రావడం సంతోషకరమని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనూరాధ తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో మాట్లాడుతూ తమ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడుగా పనిచేస్తున్న హరికృష్ణ మహారాష్ట్రలోని నాగపూర్‌లోని కమ్టిలో ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ట్రైనింగ్ అకాడమీలో మూడు నెలల పాటు శిక్షణ పొందారని తెలిపారు. అందులో ఉత్తీర్ణత పొంది లెఫ్టినెంట్ హోదా సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు హరికృష్ణను అభినందించారు.

విద్యార్థులను తీర్చిదిద్దుతున్న శ్రీనివాసరావు



చేబ్రోలు: ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీనివాసరావు అందరికీ ఆదర్శనీయులని చేబ్రోలు ఎంఈవో–1 ఆర్ సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు అభినందన సభ జరిగింది. స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఎంఈవో–2 ఏహెచ్‌ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నిబద్ధత, అంకితభావంతో విద్యాబోధన అందిస్తున్న శ్రీనివాసరావు అందరి ప్రశంసలు పొందుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినట్లు తెలిపారు. గణిత ఉపాధ్యాయుడిని పలువురు మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నూటికో –కోటికో ఒక్కడు నృత్యం ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు చలపతిరావు, శివప్రియ పాల్గొన్నారు.